"ప్రతిపక్షాల కుట్ర" అన్న హెడ్డింగుని, అందులోని విషయాల్ని (తను వ్రాసినదే అయినప్పటికి) చదివేసరికి మొహం మతాబాలా వెలిగిపోయింది.

ఒకటీ అరా తప్ప ఇంచుమించు పత్రికలన్నీ ఈ వార్తని ఇదేవిధంగా ప్రచురించాయ్.

సెంటర్ పార్టీవారు చేస్తున్న విష ప్రచారానికి ప్రతిపక్షాలన్నీ అట్టుడికినట్టు ఉడికిపోతున్నాయి.

ఎలా అయినాసరే దీన్ని ఆగ్నేయాస్త్రంలా వాడుకుని సెంటర్ పార్టీ నాయకుల ప్రతిష్ట దెబ్బతీయాలని కంకణం కట్టుకున్నారు ప్రతిపక్షాలవారు. దానిక్కూడా పత్రికలవారి శరణు కోరక తప్పదు.

సరిగ్గా అలాంటప్పుడే కొత్తగా పత్రిక పెట్టిన ఓ భీమేశంగారు కనిపించారు.

తన పత్రికని విలక్షణమైన పత్రికగా రూపొందించాలనే తాపత్రయం ఎక్కువవడంతో చాలా సుళువుగా ప్రతిపక్షాలవారి గాలానికి చిక్కుకున్నాడు.

ఇలా కొత్తగా పత్రిక పెట్టిన భీమేశంగారికి సెంటర్ దిట్టకవిగారికి రాయబారాలు వెళ్ళాయి.

"అలా తిట్టకండి మహాప్రభో... కావాలంటే ఇంతవరకూ మీరు తిట్టిన ప్రతి తిట్టుకీ ఒక రూపాయి చొప్పున ఖరీదు కట్టి బల్లకిందనుంచి ఇచ్చు కుంటాం" అని రాయబారానికి వచ్చినవాళ్ళు 'రాయ బేరాలు' సాగించారు.

"బల్లకింద నుంచి తీసుకునే అలవాటు లేదు. బల్ల మీదుగా తీసుకునే ఉపాయం నేనే చెపుతాను. అది మీరు భరించక తప్పదు. నన్ను మీ పార్టీ పత్రిక లోకి తీసుకోండి. 'తిట్టే కలం, తిరిగే జర్నలిస్టూ ఊరుకోరని' నవీన సామెత. ఆ ప్రకారం ఇంతవరకూ ఎవరి గొడుగు కింద నిలబడి తిట్టానో ఆ గొడుగు పట్టిన వాళ్ళనే తిడతాను. దెబ్బతో నా తిట్లన్నీ బేలన్సయిపోవడమేకాక మీకు నా తిట్ల బాధ తప్పుతుంది. ఎటొచ్చీ నాకు రెట్టింపు జీతం ఇవ్వాలంతే."

అదీ దిట్టకవిగారి తిట్ల బేరం సారాంశం. అది




సెంటర్ పార్టీవాళ్ళకి నచ్చింది. అయితే ఒక సందేహం పట్టుకుంది.

"బాగానే వుందికాని, మీరు ఇలా వేదిక మార్చితే మీ తిట్లకి క్రెడిబిలిటీ పోతుందేమో. మీ తిట్ల వల్ల మా పార్టీకి ఏమీ ఉపకారం జరగదేమో!?" అని సందేహాస్పదులై 'నస' సంగీతాన్ని ఆలపించారు. దానికి దిట్టకవిగారు పెద్దపెట్టున నవ్వి, 'క్రెడిబిలిటీ పోయేది జర్నలిజానికే కాని నా తిట్లకు కాదు. లెట్ జర్నలిజం గోటూ హెల్" అంటూ తన వృత్తి మీద తిట్లదండకం ఆరంభించాడు.

పార్టీలో 'పెద్ద మనుషుల్ని' తిట్టాల్సిన అవసరం పడింది గదా! దిట్టకవిగారే అందుకు తగిన మనిషని దుర్భిణీవేసి చూస్తే తేలింది. దిట్టకవిగారు సామాన్య మనిషి కాడాయెను. ఎందుకంటారా? తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టడంలో దిట్టకవిగారు సుప్రసిద్ధులు కాబట్టి.

వర్గ శత్రువుని ఉద్దేశించి బోలెడు తిట్టు కవితలు గుప్పించినా అవి ఎవరికీ తగలక పోవడంతో ఆయన కవితలు రక్తాక్షర గవాక్షాల లోపలే మూలిగాయి.

దిట్టకవిగారి తిట్లముందు సినిమా కవుల బూతులు ఎందుకూ పనికిరావని సలహాదార్లు ఢంకా బజాయించి తేల్చారు. దెబ్బతో దిట్టకవిగారికి తన మన సులో పేరుకున్న తిట్లన్నీ అర్జంటుగా అచ్చయ్యే యోగం పట్టింది. భీమేశంగారి పత్రికలో దిట్టకవిగారు సెంటర్ పార్టీ నాయకుల్ని బాధ్యత లేకుండా తిట్టే తిట్లన్నీ బాక్సులు కట్టి అచ్చొత్తించారు.

సగటు పాఠకులు ఆ తిట్లన్నీ వంటబట్టించుకొం టు ఓ సెంటర్ పార్టీ స్థానిక నాయకులు బెంబేలెత్తిపోయారు.

* * *

చదరంగపు ఎత్తుల్లో మరోపావుగా మారిన రావులమ్మ కళ్ళు మంకెనపువ్వుల్లా ఎర్రగా వున్నాయ్.

గీత్‌మాల క్యాసెట్ గెలుచుకున్న

కాలమ్ దాటని కథ

"ఏమ్మా! విశాలాక్షీ! రాత్రి దొంగలుపడ్డారట గదా? ఏమైనా ఎత్తుకెళ్ళారా?" అనే సుందరమ్మ ప్రశ్నకు "లేదండీ పిన్నిగారూ! అలికిడి అవంగానే మీ అల్లుడు గారు లేచి లైటు వేసేటప్పటికి ఎవరో పెరటి గోడ దూకడం కనిపించిదంట" అంటూ చేదని బావిలో వేసింది విశాలాక్షి.

బావి దగ్గర వుండేవాళ్ళు తలోరకంగా వ్యాఖ్యానిస్తూ మొత్తంమీద అందరూ దొంగ ఏమీ ఎత్తుకుపోనందుకు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. విశాలాక్షి నీళ్ళ బిందెతో వెళ్ళడం, నీళ్ళకోసం జగదాంబ రావడం ఒకేసారి జరిగింది.

ఆమె వస్తూనే "ఏమ్రా! విన్నారా? విశాలాక్షి ఇంట్లో దొంగలు పడ్డారట గదా! ఆ...దొంగలూ కాదు,

## తేలుకుట్టిన దొంగ

పాడూ కాదు. విశాలాక్షికీ, వాడికి స్నేహం వుంది కాబోలు వచ్చి వుంటాడు. మొగుడ్ని చూసి పారిపోయాడు" అంటూ నీళ్ళు చేదసాగింది.

ప్రతి ఒక్కరు ఆమె మాటలు విని ఆశ్చర్యపోయారు. జగదాంబ ప్రవర్తననీ, మాటల్నీ, ప్రతి ఒక్కరు మనస్సులోనే అసహ్యంచుకున్నారు. పైకి ఎవ్వరూ ఖండించలేదు ఆమెకి వ్యతిరేకంగా మాట్లాడి, ప్రవర్తించి ఎవ్వరూ నిలబడలేరు కనుక. ఆ గ్రామంలో వాళ్ళు ఆర్థికంగా, రాజకీయంగా కూడా మకుటంలేని మహారాజులు, సహజంగా అతి క్రూరులు.

పల్లె కాబట్టి ఏదో ఒక విషయంలో వారిపై ఆధారపడవలసి వుంటుంది. అందుకే ఎవ్వరూ పైకి ఏమీ అనక పోయినా మనస్సులో అసహ్యంచుకుంటారు. ఎవరింట్లో ఏం జరిగినా వక్రభాష్యం చెప్పడంలో ఆమె దిట్ట. అందరూ ఆమె నోటికి భయపడతారు కూడా. అందుకే "ఆ...ఊ..." అనకుండా నీళ్ళు చేదుకోవడంలో నిమగ్నమయ్యారు.

పళ్ళు తోముకుంటూ మేనత్త మాటల్ని విన్న రామిరెడ్డికి మెరుపులాంటి ఆలోచన వచ్చింది. ఆ రోజు రాత్రే జగదాంబ ఇంట్లో కలకలం చెలరేగింది. చుట్టుప్రక్కలవాళ్ళు వెళ్ళేటప్పటికి ఏమీ లేదంటూ అందర్నీ పంపించేశారు. జగదాంబ రాగానే రాత్రి గొడవ గురించి ఆరా తీశారు. "ఆ... ఏముందీ, ఇంట్లోకి పాము వస్తే దాన్ని కొట్టడంలో గొడవైంది" అంది కోపంగా. "మరి మెడ, చేతులు బోసిగా వున్నాయే" అంది మరో యువతి.

"క్రొత్త ఫ్యాషను చేయించమని నగల షాపుకి పంపించాలే" అంటూ తేలుకుట్టిన దొంగలా విసవిసా వెళ్ళింది జగదాంబ. దొంగతనం జరిగిందంటే "అక్రమ సంబంధం" అంటగట్టే జగదాంబకి బాగానే శాస్తి జరిగిందని ఒకర్నొకరు చూసుకుంటూ గుంభనంగా నవ్వుకున్నారు ఆడవాళ్ళు.

రామిరెడ్డికి మాత్రం భలే సంతోషంగా వుంది. అత్త బలహీనత ఆధారంగా ఏడు తులాల బంగారం చేజిక్కించుకుని కూనిరాగం తీసుకుంటూ పేకాట కోసం బస్తీ వైపు దారి పట్టాడు. —జి.జానకీబాయి